

నేటి నుంచి ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజంపేట, జూలై 14: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 18వరకు ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ రెండు విడుతల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులు గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి గత మార్చి 2024 వరకు చేపట్టిన పనులు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న అన్నారం, ఎల్లారెడ్డిపల్లి తండా, గుడితండా, ఆర్గొండ, పొందుర్తి, బస్వన్నపల్లి, 16న కొండాపూర్, గుండారం, ఆరెపల్లి, 18న శివాయిపల్లితదితర గ్రామసభలు నిర్వహించబడతాయని అన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు..
రూ. 20.50 కోట్లు!

కామారెడ్డి, జూలై 14(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం ముగిసి ఇతర కోర్సుల్లో ప్రవేశించేందుకు సర్టిఫికెట్లకై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయి. ఫీజులు కడితే కాని సర్టిఫికెట్లు ఇవ్వమని తెగేసి చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటు విద్యార్థులకు, అటు కళాశాల యాజమాన్యాలకు తీపి కబురు అందించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రైవేట్ కళాశాలలకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని సీఎం తాజాగా హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.20.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం కలుగనుంది.

గత రెండేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై సుమారు 10 నుంచి 15వేల మంది విద్యార్థులు ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో సుమారు 12వేల మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 10వేల మందికి పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి గత రెండెళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. రూ.13కోట్ల వరకు బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు ఏడాది కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. 3120 మంది విద్యార్థులకు రూ.3.40కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులకు సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉండగా వీరికి సుమారు రూ.2.10 కోట్లు 2627 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కావాల్సి ఉంది. వీరికే కాకుండా మైనార్టీ విద్యార్థులకు సైతం రూ.2కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపినా విడుదల కాని బడ్జెట్

కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయా సంబంధిత శాఖల అధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ బడ్జెట్ విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలికలు పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు నెలనెల చెల్లించే స్కాలర్‌షిప్ సొమ్మును కూడా విడుదల చేయడం లేదు. జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, బీఈడీ, డీఎడ్, ఇంజనీరింగ్, నర్సింగ్, బీ ఫార్మసీ తదితర కోర్సులకు సంబంధించి కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు సైతం ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నిర్ధేశించిన మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజు కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. మెస్‌చార్జీల కింద కోర్సులను బట్టి స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ సొమ్మును నెలనెల కాకుండా ఒకేసారి విద్యార్థుల ఖాతాలో జమ చేస్తారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు కేవలం స్కాలర్‌షిప్ డబ్బులను మాత్రమే వారి ఖాతాలో జమ చేస్తారు.

- సీఎం ప్రకటనతో కళాశాల యాజమాన్యాల్లో, విద్యార్థుల్లో ఆశలు
- వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామన్న ప్రభుత్వం
- రెండేళ్లుగా విడుదల కాని బడ్జెట్
- విద్యార్థులకు అందని స్కాలర్‌షిప్‌లు
- కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఫీజు వసూళ్లు
- ఇబ్బందులు పడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

రెండేళ్ల నుంచి ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు తంటాలు పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని సమాచారం. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి మాత్రం కాగితాలు రాయించుకుని ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెబుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. రెండు విద్యా సంవత్సరాలు ముగిసినా కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులతో పాటు స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఆయా పథకాలకు బడ్జెట్‌ను మళ్లించడంతో ఫీజులు విడుదల కావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కోరుతున్నాయి.



నీరు లేక వెలవెల బోతున్న జలాశయాలు



నిజాంసాగర్ ప్రాజెక్టులో అడుగంటిన నీటి నిల్వలు



..నల్లవాగు మత్తడి

నిజాంసాగర్, జూలై 14: వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాలు కురియడం లేదు. జలాశయాల్లో నీరు లేక వెలవెలబోతున్నాయి. ఆయకట్టు రైతాంగం వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్టులతో పాటు కళ్యాణి, సింగీతం రిజర్వాయర్లు, నల్లవాగు మత్తడిలో నీటి నిల్వలు లేక బోసిపోయాయి. భారీ జలాశయాలైన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఎలాంటి నీరు రాకపోవడంతో నీటి నిల్వలు అడుగంటి పోతున్నాయి. సాగర్‌లో ప్రస్తుతం 1405 అడుగులకు గాను 1387.42 అడుగుల నీటి నిల్వలున్నాయి. కౌలాస్‌నాలాలో కూడా నీటి నిల్వలు అడుగంటి పోయాయి. సింగీతం, కళ్యాణి రిజర్వాయర్లు కూడా నీటి నిల్వలు లేక పోయాయి. ప్రాజెక్టులో నీటి నిల్వలు లేకున్నా ఈ ఏడాది ఆయకట్టు కింద లక్షా 15 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేశారు. మొదటి విడతగా 1.5 టీఎంసీల నీరు విడుదల చేయగా, కేవలం 3.09 టీఎంసీల నీటి నిల్వలు న్నాయి. సింగీతం రిజర్వాయర్ ఆయకట్టు 600 ఎకరాలకు నీరు అందించేందుకు ఉండగా, నీటి నిల్వలు అడుగంటి ఉన్నాయి. నాన్ కమాండ్ ఏరియాలోని నల్లవాగు ఆనకట్టలో నీరు లేకుండా పోయి ంది. మంజీరా ఉప నది పైన ఉన్న ఈ నల్లవాగు ఆనకట్ట 1700 ఎకరాలకు సాగునీరు అందిస్తుండగా, కేవలం 400 ఎకరాలకే సాగు నీరు అందిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి పూడిక వచ్చి చేరడంతో నీటి మట్టం తగ్గిపోయింది. పూర్తిస్థాయిలో నీరు అందించడం లేదు. వరి నాట్లు పూర్తి చేశారు. మంజీరా నది నీరు లేక బోసిపో యింది. మంజీరా వెంట ఉన్న రైతాంగం ముందస్తుగా నాట్లు వేయగా, నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపా దడపా వర్షాలు ఆశించిన స్థాయిలో నీరు ఇవ్వలేకపోతున్నాయి. ప్రతిరోజూ రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే జలాశయాల్లో నీరు వస్తాయని ఆశతో ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కొండ పోచమ్మ నీటిని విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికీ నీటి పారుదల శాఖాధికారులు ఎలాంటి ఆదేశాలు రాక పోవడం గమనార్హం. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇక ప్రాజెక్టులు, రిజర్వాయర్ల కింద వరి సాగు ఆగమ్యగోచరంగా మారనుంది.



..సింగీతం రిజర్వాయర్



..కళ్యాణి రిజర్వాయర్

పోచారం ప్రధాన కాలువలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగిరెడ్డిపేట, జూలై 14: మండలంలోని పోచారం ప్రధాన కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించే పనులను నీటి పారుదల శాఖ అధికారులు చేపట్టారు. పోచారం ప్రధాన కాలువలో పూడిక, పిచ్చి మొక్కలు, గడ్డి పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారడంతో ఈనెల 12న శుక్రవారం 'పోచారం కాలువలో నీరు పారేదెలా?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' వార్త కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తకు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన గడ్డిని, పిచ్చి మొక్కల తొలగింపు పనులను చేపట్టారు. తమ సిబ్బంది చేత ప్రధాన కాలువలోని పిచ్చి మొక్కలను, గడ్డిని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తొలగింపు పనులను జరుపుతున్నారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి ఈ ఖరీఫ్‌లో ఆయకట్టు చివరి వరకు సాగు నీరందేలా కృషి చేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.



పోచారం ప్రధాన కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది



బాన్సువాడలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా బోనాల మహోత్సవం

బాన్సువాడ టౌన్, జూలై 14 : పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో గల శ్రీకనక దుర్గాదేవి ఆలయ ఆషాఢ మాస బోనాల మహోత్సవాలను ఆదివారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనమెత్తి ఊరేగింపులో పాల్గొన్నారు. పాతబాన్సువాడ చావిడి నుంచి అమ్మవారి పాటలపై మహిళలు స్టెప్పులేస్తూ బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. వర్షపు చినుకులు పడుతున్నప్పటికీ మహిళలు శోభాయాత్రలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ఈ బోనాల పండుగలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అందరితో కలిసి నెత్తిన బోనమెత్తి ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

స్వప్నలోక్‌లో ..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని స్వప్నలోక్ కాలనీలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ హాజరయి బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, రైతన్నలు సుఖ సంతోషాలతో పాడి పంటలు పండించాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఏ అనారోగ్యాలు లేకుండా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో అన్ని మంచి పనులు జరిగి కాలనీ త్వరగా అభివృద్ధి చెందాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కాలనీలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉరుదోండ వనిత, కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి, స్వప్నలోక్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దన్నూర్‌లో..

మద్నూర్: మండలంలోని దన్నూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్థులు సామూహికంగా బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలతో అమ్మవారికి సమర్పించడానికి డప్పుల చప్పులతో బయలుదేరారు. బోనం కుండకు పసుపు రాసి కుంకుమ, పెట్టి వేపాకులను మాలలుగా చుట్టి తయారు చేశారు. బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలను సమర్పించారు. అనంతరం గ్రామంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని దన్నూర్ గ్రామంలో భారీగా గ్రామస్థులు ఆలయానికి చేరుకుని, అమ్మవారికి మేకపోతులను బలి ఇచ్చారు. వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని, గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని, పిల్లపాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. ప్రతీ ఏడాది అమ్మవారి మొక్కులను తీర్చుకోవడానికి సామూహికంగా గ్రామంలో బోనాల పండుగ నిర్వహిస్తుంటారు. ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.



బాన్సువాడలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కామారెడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

జిల్లాలో మోస్తరు వర్షం



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

కామారెడ్డి టౌన్ జూలై 14: కామారెడ్డి పట్టణంతో పాటు పలు మండలాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షకాలం ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ దేవతలకు పూజలు చేయడంతో పాటు పాత కాలం నాటి అనేక ఆచారాలను పాటిస్తు పూజలు చేస్తూ వస్తున్నారు. కామారెడ్డిలో దాదాపు గంటన్నర పాటు వర్షం కురువడంతో ప్రజలతో పాటు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో ఇప్పటికే నీటి కటకట ఏర్పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు పడితేనే ప్రజల నీటి కష్టాలు తీరనున్నాయి. కొత్త పట్టణంలో ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆదివారం పడిన వర్షంతో ప్రజలు ఒకింత ఆనందం వ్యక్తం చేసినప్పటికీ ఇక మీదటనైన వరణుడు కరుణించి భారీ వర్షాలు పడాలని కోరుకుంటున్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఆశించదగ్గ వర్షాలు కురియకపోవడం అన్నదాతలు దిగాలు చెందారు. గత వారం రోజుల క్రితం బాన్సువాడలో రాత్రి వేళ భారీ వర్షం కురవడంతో రైతన్నలు పంట పొలాల్లో నాట్లు వేసుకున్నారు. తాజాగా కురిసిన వర్షంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లిలో మహాలక్ష్మీకి జలాభిషేకం

ముప్కాల్, జూలై14: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మీకి జలాభిషేకం చేశారు. ఉదయం గోదావరి నుంచి జలాలను తీసుకువచ్చి గ్రామ పొలిమేరల నుంచి డప్పువాయిద్యాలు, వలగొడుగులతో గ్రామవీదులగుండ ఊరేగింపుగా తీసుకువచ్చి మహాలక్ష్మీకి జలాభిషేకం చేశారు. అనంతరం మహాలక్ష్మీదేవికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అన్నారు.

ముప్కాల్‌లో స్వచ్ఛత పక్వాడ్

ముప్కాల్, జూలై14: ఈనెల 1నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా భారతీయ పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో పరిసరల పరిశుభ్ర చేట్టారు. ఆదివారం ముప్కాల్ బస్టాండ్ ప్రాంతంలో భారత్ పెట్రోలియం సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు పరిసరాల్లోని చెత్తను తొలగించారు.

'మురికి కాలువలతో సమస్యలు తలెత్తకుండా చూడాలి'

మెండోర, జూలై14: రానున్న వర్షాకాలంలో ప్రజలకు మురికికాలువలతో సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు ముత్యాల సునీల్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో మురికికాలువలను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న మురికికాలువల నిర్మాణాల సమస్యలపై సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రానున్న రోజుల్లో వర్షాలు పడి మురికి కాలువల సమస్య లేకుండా చూడాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, సామ నరేష్, లింగారెడ్డి, గంగారెడ్డి, బాస్కర్, సాయరెడ్డి, రమేష్, మహేష్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోటగిరి, జూలై14: కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ ఆశ్రమంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎర్రగడ్డ ఈఎస్ఐ హాస్పటల్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ వాపూర్వ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి యోగక్షేమాలను వాకబు చేసి తనవంతు సహాయంగా 30వేల విరాళం అందజేశారు. రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ సంజయ్ శివరాం విద్యార్థులతో మాట్లాడారు. ఆర్మీలో ఎంపిక ప్రక్రియ, క్రమశిక్షణపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీధర్, ఇన్‌చార్జి మధు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో సందడిగా మారిన శ్రీరాంసాగర్

మెండోర, జూలై 14 : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. దీంతో ప్రాజెక్టులో వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుంది. దీంతో సుమారు ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రాజెక్టును సందర్శించడానికి తండోపతండాలుగా తరలివస్తున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యా టకులు తమ సెల్ ఫోన్‌లతో సెల్ఫీలు దిగుతూ తమ ఫోన్‌లలో బందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుపై కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బం దులు పడుతున్నారు. అధికారులు పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని కనీస వసతులు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఉచితంగా మాత్రల పంపిణీ



మందులను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం సభ్యులు

ఆర్మూర్‌టౌన్, జూలై 14 : పట్టణంలోని రాజారాంనగర్, కెనాల్ కట్ట ప్రాంతంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మాత్రలను పంపిణీ చేశారు. రాబోవు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఉచిత హోమియోపతి డెంగ్యు నివారణ ముందస్తు మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు దివ్యభారతి, హరిష్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, ప్రాజెక్టు చైర్మన్ కొంగి మనోహర్, ద్యాగ ఉదయ్, అంబల్ల తిరుపతి, శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, గుర్రం విజయానంద్, రమణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డిని కలిసిన చిట్టాపూర్ గ్రామస్థులు



సునీల్‌రెడ్డిని కలిసిన చిట్టాపూర్ గ్రామస్థులు

ముప్కాల్, జూలై14: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి లిఫ్ట్ మం జూరైనా పనులు జరగడం లేదని చిట్టాపూర్ గ్రామస్థులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డిని మోర్తాడ్ లోని ప్రజా నిలయంలో కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన సునీల్‌రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారం భించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిట్టాపూర్ వీడీసీ సభ్యులు లింగన్న, రాజారాం, తెడ్డుసాయిలు, సత్యరాజు, రమేష్, సత్యం, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో బినోల వాసికి బంగారు పతకాలు



స్విమ్మింగ్ పోటీలలో బంగారు పతాకాన్ని అందుకున్న మిట్టాపల్లి రిత్విక

నవీపేట,జూలై14: మండలంలోని బినోలకు చెందిన మిట్టాపల్లి రిత్విక రాష్ట్రస్థాయి స్విమ్మిగ్ పోటీలలో మూడు బంగారు పతాకాలు, రెండు కాంస్య పతాకాలను సాధించింది. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ తెలంగాణ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్ షిప్-2024 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 13, 14తేదిలలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో నిజామాబాద్ జిల్లా తరపున పాల్గొన్న మిట్టాపల్లి రిత్విక గ్రూప్-1 బాలికల విభాగంలో 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకం, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకం, 200మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకంతో పాటు 50మీటర్ల బటర్ ఫ్లైలో కాంస్య పతాకం, 200మీటర్ల ఇండివిజిల్ మిడ్లేలో కాంస్య పతాకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆగస్టు 6నుండి 11వ తేది వరకు ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో జరిగే 40వ సబ్ జూనియర్ నేషనల్ అక్విటిక్ చాంపియన్ షిప్-2024, 50వ జూనియర్ నేషనల్ అక్విటిక్ చాంపియన్ షిప్-2024 జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపికైన మిట్టాపల్లి రిత్వికను తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు జీ.మైపాల్ రెడ్డిలు అభినందించారు.

చిన్నమావంది గ్రామంలో విషాద ఛాయలు

బోధన్‌రూరల్, జూలై14 : బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన శ్రీరాం పద్మ, కూతురు గౌతమికి జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో శ్రీరాం పద్మ అక్కడికక్కడే మృతి చెందడం, గౌతమికి గాయాలయ్యాయి. శ్రీరాం పద్మ మరో కూతురు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా ఆదివారం ఆమెను కలిసేందుకు వెళ్లి వస్తున్న సందర్భంలో కారు ఢీకొనడంతో అక్కడికక్కడే శ్రీరాం పద్మ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే శ్రీరాం పద్మ ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని చిన్న కూతురును చూడడానికి వెళ్లి కారు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



మాక్లూర్ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



గురువులతో 2001-02 పదో తరగతి విద్యార్థులు

● పలు మండలాల్లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు
● ఉపాధ్యాయులకు సన్మానాలు

మాక్లూర్, జూలై 14 : మాక్లూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2002-02 సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల కళాయిక ఆహ్లాద వాతావరణంలో కొనసాగింది. గత 23ఏళ్ల మాక్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాల వెళ్ళిపోయిన వారు ఒక్క చోటికి చేరారు. నాడు విద్యార్థి దశలో చోటు చేసుకున్న సంఘటనలు గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులందరు కలిసి సంతోషంగా కాలక్షేపం చేశారు. పలువురు పూర్వవిద్యార్థుల ఉన్నతని తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో విద్య వ్యవస్థలో ఉన్న పరిస్థితులు నేటి పరిస్థితులను పోల్చుతూ ఉపాధ్యాయులు పలు సందేశాలు చేశారు. మాక్లూర్ ఉన్నత పాఠశాలలో విద్య నభ్యసించేందుకు కృష్ణనగర్, దుర్గానగర్, గాంధీనగర్, బోంకన్‌పల్లి, ముల్లగి గ్రామాల నుంచి కాలినకడన విద్యార్థులు వచ్చేవారని ఉపా ధ్యాయులు గుర్తు చేశారు. పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బాగేందర్, భూపతిరెడ్డి, మల్కయ్య, రవీందర్‌గుప్తా, వేణుగోపాల్, గంగారెడ్డి, వెంకటరాజయ్య, పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్నిలో ...

వర్ని,జూలై14: మండల కేంద్రంలో ఆదివారం 2001-02విద్యా సంవత్సరంకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఘనంగా ఆత్మీయ స్నేమ్మేళనం నిర్వహించారు. వడ్డేపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించినందుకు ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తమకు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చిన గురువులను సన్మానించారు. తమ గురువుల విద్యతో 53మంది విద్యార్థులలో ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, న్యాయవాదులుగా, వ్యాపార రంగాల్లో స్థిరపడి భవిష్యత్తుకు బాటలు వేసుకున్నామని పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను గురువులతో పంచుకున్నారు. తల్లిదండ్రుల తర్వాత తమకు అంతటి స్థానాన్ని కల్పించిన ఘనత తమ గురువులకే దక్కుతుందని హర్షం వ్యక్తం చేశారు. తమపై ఆధారపడి విద్య నేర్చుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడ్డ విద్యార్థులను గురువులు ప్రశంసించారు. విద్య నేర్పిన గురువులు విజయనందరావు, సత్యనారాయణ, అంజయ్య, రుక్మిణి, గోపాల్, పీఈటీ వెంకటేశ్వార రావులకు పాదాభివందనం చేసి గ్రూపు ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బానోత్ రమేష్, నరేడ్ల బాలు, మొబైల్ శ్రీను, కృష్ణ, డీ.రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్, జూలై14 : బాల్కొండ మండలం కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2000-01 సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 23ఏళ్ల తర్వాత తోటి మిత్రులతో కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. 23 ఏళ్ళ తర్వాత గురువులు, ఉపాధ్యాయులు ఒక చోట చేరి అప్యాయంగా పలకరిం చుకున్నారు. వారి యోగ క్షేమాలు అడిగితె లుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాం తాల్లో వ్యాపారాల్లో, ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ చిన్ననాటి తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను పుష్పనాథ్‌రెడ్డి, లింబాద్రిలను పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించారు. గురువులు చెప్పిన విద్యాబుద్దులు నేర్చు కొని జీవితంలో స్థిరపడ్డామని గురువులది గొప్ప స్థానం అని కొనియాడారు.



కిసాన్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో కలిసి పూర్వవిద్యార్థులు

23 ఏళ్ల తర్వాత..

డిచ్‌పల్లి, : వారంత 2001-02 విద్యాసంవత్సరంలో విశ్వశాంతి హైస్కూల్ ఒకే దగ్గర కలిసి చదువుకున్నారు. 23ఏళ్ల అనంతరం ఆదివారం బర్దిపూర్ శివారులో గల క్రిష్ణ హోటల్ లో ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బోధన చెప్పిన గురువులను శాలువలు, బహుమతులతో ఘనంగా సత్కరించారు. 23ఏళ్ల తర్వాత అందరు ఒకే చోటుకు చేరుకోవడంతో సంతోషకర వాతవరణం ఏర్పాడింది. ఒకరినోకరి కుటుంబల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరు కలిసి భోజనలు చేశారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్‌కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 14: మండలంలోని వివిధ గ్రామాలలో పలుబాధిత కుటుబాలను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరమార్శించి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కమ్మర్‌పల్లిలో అనారోగ్యంతో భార్యచనిపోయిన అకిల రవి, రోడ్డుప్రమాదంలో భార్య ఆకులు తిరుమల, అనారోగ్యంతో తల్లి మరణించడంతో బషీరాబాద్‌కు చెందిన ఆకులు లింగన్న కుటుంబసభ్యులను, హసాకొత్తూర్ గ్రామానికి చెందిన భూమన్నకు 3లక్షల 70 వేల ఎల్‌వోసిఅందజేయగా గుండెసభందిత శస్త్రచికిత్స(బైపాస్ సర్జరి) అనంతరం మరణించగా ఆయన కుటుంబసభ్యులను, పక్షవాతంలో బాదపడుతున్న అదేగ్రామానికి చెందిన గంగారాంను ముత్యాల సునీల్ కుమార్ పరమార్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు పాలెపు నర్సయ్య, బుచ్చిమల్లయ్య, అజారోద్దీన్, సింగిరెడ్డి శేఖర్, నల్ల సాయికుమార్, పడిగెల ప్రవీన్ , రేవతి గంగాధర్, మనోహర్, సక్కరం నారాయణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

స్పోర్ట్స్ షూటింగ్‌లో ఆదర్శ కళాశాల విద్యార్థిని ప్రతిభ

● తమిళనాడులో జరుగుతున్న స్పోర్ట్ షూటింగ్‌లో పాల్గొంటున్న సాత్విక

జక్రాన్‌పల్లి, జూలై14: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాల, కళాశాల బైపీసీ ఇంటర్మీడియేట్ పూర్తి చేసి సుధనవేణి సాత్విక ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి రాష్ట్రాల నుంచి సాత్విక ప్రతినిధ్యం వహిస్తుంది. తమిళనాడులో జరుగుతున్న ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షిప్‌లో ఉమ్మడి రాష్ట్రాల నుంచి నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల గ్రామానికి చెందిన సాత్విక తమిళనాడులో జరుగుతున్న స్పోర్ట్స్ షూటింగ్‌లో పాల్గొంటుందని ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సుమలత శ్రీనివాస్‌గౌడ్ దంపతుల కూతురు సాత్విక ప్రస్తుతం నిజామాబాద్‌లోని మహిళ డిగ్రీ కళాశాలలో బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో చురుకుగా ఉండే సాత్విక భివష్యత్‌లో మరెన్నో క్రీడల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాత్వికను ఆదర్శ కళాశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.



స్పోర్ట్స్ షూటింగ్‌లో పాల్గొన్న సుధనవేణి సాత్విక

ఘనంగా బోనాల పండుగ



బినోలలో బోనాలను ఎత్తుకున్న మహిళలు



నల్ల పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలివెళ్లిన భక్తులు



పొతంగల్‌లో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోటగిరి,జూలై14: పొతంగల్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత పొతంగల్, కొత్త పొతంగల్ గ్రామాలలో హనుమాన్ ఆలయాల నుండి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్ద పోచమ్మ తల్లి ఆలయాల వరకు కొనసాగింది. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీజేలు ఏర్పాటు చేసి చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్దిగా కురిసి పంటలు సమృద్దిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్ని శంకర్, పవన్, వీరేశం, విఠల్, గంధపు రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు : రుద్రూరు మండలంలోని అంబం (ఆర్) గ్రామం లో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం ముందుగా ఊరడమ్మ తల్లి ఆలయం వద్ద సర్కారు గొరైతో ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య ముదిరాజ్, యాదవ, పెరిక మత్స్యకార, కుర్మ తదితర సం ఘాల నుంచి మహిళలు బోనాలు తీసి మేకలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ, మైసమ్మ, లక్ష్మమ్మ, నల్ల పోచమ్మ, కట్ట మైసమ్మ, కట్ట రాజులు, ఎల్లమ్మ, మత్తడి పోచమ్మ, గజ్జెలమ్మ తదితర ఆలయాల వద్ద నైవే. ద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రెంజర్ల గంగారాం, కార్యదర్శి రాములు, ఆసం రాము, పట్టేపు రాములు, పోశెట్టి, ఎంజీఆర్, హన్మాండ్లు, కపిల్, మహేష్, సాయిలు, బాలు, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక నల్ల పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత పొతంగల్, కొత్త పొతంగల్ గ్రామాలలో హనుమాన్ ఆలయాల నుండి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్ద పోచమ్మ తల్లి ఆలయాల వరకు కొనసాగింది. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

డిచ్‌పల్లి,జూలై 14: లయన్స్ క్లబ్ నిజామాబాద్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ లక్ష్మీ తెలిపారు. మండలంలోని యానంపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాల్ లో సమావేశమైన ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా కైరంకొండ మురళి, కార్యదర్శులుగా గంగారాజు, కోశాధికారి గా రవీందర్ లు ఎన్నికయ్యారు. ఎన్నికైన ఈ నూతన కమిటీని పూర్వ జిల్లా కన్వీనర్ బసవేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పెంటయ్య, గంధాని శ్రీనివాస్, అనిల్ పటేల్, అగర్వాల్, యాదగిరి, తులసిదాస్, లక్ష్మణ్, ధర్మరాజు, ప్రవీణ్, పుల్గం హన్మండ్లు, గురుచరణ్ పాల్గొన్నారు.

పోడు రైతుల సంతకాల సేకరణ

వర్ని, జూలై 14 : పోడు భూమిని సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనేతర నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరుతూ పోడు భూముల సాధన కమిటీ నాయకులు చందూర్ బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరుపేద పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, శ్రీను, హన్మాండ్లు, సాయి, అబ్బయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

జక్రాన్‌పల్లి, జూలై 14 : మండలంలోని అర్గుల్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ ఆలయంలో నూతనంగా నాగమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇదే ఆలయంలో లంబడవ్వ విగ్రహాన్ని పునఃపతిష్టించారు. వీడీసీసభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పోచమ్మకు భక్తుల నైవేద్యాలు

పెర్కిట్, జూలై 14 : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని పోచమ్మ ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా ఆదివారం కుటుంబ సమేతంగా వచ్చి పోచమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. అలాగే పట్టణంలోని నల్ల నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బోధన్ కోర్టు ఏజీపీగా మాజీ మున్సిపల్ చైర్మన్



ఏజీపీగా నియమితులైన గౌసోద్దీన్‌ను అభినందిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జూలై14: బోధన్ కోర్టు ఏజీపీగా మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసోద్దీన్ న్యాయవాది నియామకం అయిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను అభినందించారు. చట్టపరంగా ప్రజలందరికీ న్యాయం చేకూర్చేలా చూడాలని కోరారు. అనంతరం అతనిని సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రమోద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



సూర్య ఆరోగ్య సంస్థ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్

డిచ్‌పల్లి, జూలై 14 : సూర్య ఆరోగ్య సంస్థ ప్రచురించిన బ్రోచర్‌ను రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆదివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సూర్య ఆరోగ్యసంస్థ నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు, టీబీ, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న పౌష్టికాహార కిట్లు అందించి సేవలు చేయడం అభినంద నీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు, దంత పరీక్షలు, ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు తమ సంస్థ ద్వార నిర్వహిస్తునట్లు సంస్థ చైర్మన్ భగవన్, సీవోవో రాజేంద్ర కుమార్ చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వినోద్ కుమార్, నరసింహరావు, ధనుంజయ్, పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన ధర్మారం గురుకుల విద్యార్థినులు

డిచ్‌పల్లి, జూలై 14 : మండలంలోని ధర్మారం (బీ) సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థినులు ఐఐటీలలో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.అభినయ(ఐఐటీ, వారణాసి), బీటెక్ ఫార్మాసిటికల్ ఇంజనీరింగ్ లో బి.వర్ష, (హెచ్‌సీయూ), కృతజా(ఐఐటీ దర్వాడ్) లో సీట్లు పొందారని ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సంగీత అభినందించారు.

'కాసుల బాల్‌రాజ్ సభను విజయవంతం చేయాలి'

రుద్రూరు, జూలై 14 : తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం మొట్ట మొదటిసారిగా బాన్సువాడ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా బైక్ ర్యాలీ, సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు రుద్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న (సోమవారం) కొయ్యగుట్ట నుంచి ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీతో ప్రారంభమై బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో కాసుల బాల్‌రాజ్‌కు ఘన స్వాగతం, సన్మాన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే పోచా రం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన యెండల

రుద్రూరు, జూలై 14 : మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం బాన్సువాడ నియోజకవర్గం బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. కార్యకర్త జల్ల సాయికిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా రుద్రూరు మండల ఉపాధ్యక్షులు ఎర్రోళ్ళ శంకర్ భార్య రేణుకా మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో కార్యకర్తను పరామర్శించి ఓదార్చారు. అక్బర్‌నగర్‌లో ఇటీవల మృతిచెందిన కాజా సుధాకర్‌రావును కూడా యెండల లక్ష్మీనారాయణ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో రుద్రూరు మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, బీజేపీ నాయకులు రామ్‌రాజ్ తదితరులు ఉన్నారు.



చిక్కడ్‌పల్లిలో కార్యకర్తను పరామర్శిస్తున్న యెండల లక్ష్మీనారాయణ

వసతి గృహాల్లో పాముల బెడద లేకుండా చూడాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్



విద్యార్థిని పరామర్శిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్, జూలై 14 : వసతి గృహాలు, పాఠశాలల్లో పాముల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. ఆదివారం భిక్కనూర్ మండలంలోని గురుకుల పాఠశాలలో ఇటీవల పాముకాటుకు గురైన అక్షిత్ అనే విద్యార్థిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు వస్తున్నాయని, పరిశుభ్రతపై అధికారులు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్, సిద్దిరాములు, బాలరాజు, రమేష్ పాల్గొన్నారు.

కోమట్‌పల్లిలో వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, జూలై 14 : లింగంపేట మండలంలోని కోమట్‌పల్లి గ్రామశివారులో అదే గ్రామానికి చెందిన ధరణి ఎల్లయ్య (35) చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. ఎల్లయ్య తన భార్య ప్రవీణకు మధ్య శనివారం ఉదయం గొడవ జరిగింది. ప్రవీణ ఇంట్లో నుంచి వెళ్లి పోగా భర్త ఎల్లయ్య ఆమెను వెతికి తీసుకువచ్చాడు. అదే రోజు రాత్రి తిరిగి మళ్లీ గొడవ జరగడంతో రాత్రి 11గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన ఎల్లయ్య తిరిగి రాలేదు. దీంతో ఉదయం నుంచి కుటుంబ సభ్యులు గ్రామంలో వెతుకుతుండగా గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. వెళ్లి చూడగా ఎల్లయ్య మృతిచెందిందని, ఎల్లయ్య తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న యువకులు

భిక్కనూరు, జూలై 14: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విధితమే. ఈ మేరకు ఆదివారం కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల నవీన్ రూ.4 వేలు, పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన 2000-01 పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.5వేలు, కాచాపూర్ గ్రామానికి చెందిన యువ కులు బియ్యం, కిరాణ సామానుతో పాటుగా నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మృతుడి స్నేహితులు, పెద్దమల్లారెడ్డి, కంచర్ల, కాచాపూర్ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, జూలై 14 : మండల కేంద్రంలోని బాలికల ఎస్సీ హాస్టల్లో ఆదివారం విద్యార్థులకు వాసవీక్లబ్ దోమకొండ మండల అధ్యక్షుడు చింతల రాజేష్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, ఎగ్జామ్స్ ప్యాడ్‌లు, పెన్నులు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థానంలో నిలవాలన్నారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్రెటరీ లింగ శ్రీకాంత్, క్యాషియర్ రేఖ నవీన్, గౌరవసభ్యులు గజవాడ శ్రీకాంత్, చెన్నం రవి, ముక్క శ్రీనివాస్, తాటిపల్లి శ్రీధర్, పారెపల్లి సురేష్, లింగ రవి, చేపూరి సంతోష్, హాస్టల్ వార్డెన్ మంజుల పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన రాములు

గాంధారి, జూలై 14 : మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం కోతుల దాడిలో మండలకేంద్రానికి చెందిన కామెల్లి రాములకు తీవ్రగాయాలయ్యాయి. రాములు ఇంటివద్ద ఉండగా ఒక్కసారిగా కోతులు ఆయనపై దాడికి పాల్పడ్డాయి. తలపై తీవ్ర గాయాలు కావ డంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. రెండురోజుల క్రితం అదే కాలనీకి చెందిన వ్యక్తులను గాయపరిచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెం దుతున్నా రు. మండల కేంద్రంలో ఇప్పటికే చాలామంది ప్రజలకు కోతులు తీవ్రంగా గాయపరిచాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పం దించి కోతులను అడవులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు.

రోడ్డుపనులు పరిశీలించిన ఆర్‌అండ్‌బీ ఎస్ఈ



పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారి

బీర్కూర్, జూలై 14 : బీర్కూర్ నుంచి దుర్కి వరకు గల రహదారితో పాటు బీర్కూర్‌లో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను ఆదివారం ఆర్‌అండ్‌బీ నిజామాబాద్ ఎస్ఈ హన్మంతరావు కిందిస్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్ నుంచి దుర్కి వరకు గల రహదారి ధ్వంసం అయిందని, అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయని అన్నారు. అధికారులు రహదారి పరిశీలించి అంచనా వేసి పంపించాలన్నారు. నిధులు విడుదల అయిన అనంతరం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బీర్కూర్‌లో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించి పనులకు సంబంధించిన వివరాలను కిందిస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ రవి శంకర్, డీఈ మోహన్, ఏఈలున్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

బాన్సువాడ టౌన్, జూలై 14: జిల్లాలోని అన్ని మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ఖాళీ స్థానాలను భర్తీ చేయాలని, బదిలీలు , పదోన్నతులలో సాంకేతిక లోపంతో నష్టపోయిన సీనియర్ ఉపాధ్యాయులకు మరోసారి అవకాశమివ్వాలని, ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నీటి సౌకర్యానికి ఏర్పాట్లు

- నీటిపైప్‌లైన్‌లు వేసేందుకు తవ్వకాలు
- పూర్తిస్థాయిలో దృష్టిసారించాలంటున్న రోగుల బంధువులు



నీటివసతి కోసం చేపట్టిన పనులు

కామారెడ్డిటౌన్, జూలై 14:ప్రభుత్వ ఆసుపత్రిలో నీటికటకటతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ఆదివారం వచ్చిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో నీటి సౌకర్యానికి మున్సిపల్ అధికారులు పైప్‌లైన్‌ను ఏర్పాటుచేసేందుకు తవ్వకాలు చేపట్టారని తెలిపారు. నీటి సౌకర్యం అంతంతమాత్రంగానే ఉండడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడిన మాట వాస్తవమేనని తెలిపారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ దృష్టికి నీటి సమస్యను తీసుకుపోగా మున్సిపల్ ద్వారా పైప్‌లైన్ వేయించే దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు నీటి పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు మొదలుపెట్టారని, త్వరలోనే నీటి సమస్యను అధిగమించడంతో పాటు రోగులకు ఇబ్బందులు కలుగకుండా అధికారుల దృష్టికి నీటి తీవ్రతను తీసుకుపోతామని తెలిపారు.

● ఏండ్ల నుంచి అవస్థలు పడుతున్న స్పందన కరువు

గత కొన్నేండ్లుగా తాగునీటికి, ఇతర అవసరాలకు రోగులు, వారి బంధువులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బయట ఉన్న ప్రైవేట్ వ్యాపార సంస్థలు ఏర్పాటుచేస్తున్న నీటి సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత కొన్నేండ్లుగా ఆసుపత్రిలో ఒకే ఒక బోరు ఉండడం దాని నుంచి సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు వారి బంధువులు ఒంటికి, రెంటికి సులబ్ కాంప్లెక్స్‌లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సులబ్‌కాంప్లెక్స్ నిర్వాహకులు వారికి సరిపడ నీరు బోరు ద్వారా వాడుకున్నాకే ఆసుపత్రి అవసరాలకు నీటిని అందజేయడంతో మున్సిపల్ వాటర్‌ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుంది. నీటికొరతపై ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దృష్టికి రోగులు, వారి బంధువులు తీసుకుపోతే నీటిసౌకర్యాలపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఆసుపత్రికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం నీటికొరత ఉండడంతో మున్సిపల్ అధికారులు నీటి ట్యాంకర్లను అంతంత మాత్రంగానే సప్లయ్ చేస్తువచ్చారు. దీంతో ఎమ్మెల్యే తన ట్రస్ట్ ద్వారా ఆసుపత్రి ముందుభాగంలో బోరు వేయించిన నీరు అంతంతమాత్రంగానే అందుతుంది. అటు ట్యాంకర్ల ద్వారా నీరు అంతంతమాత్రంగానే అందడం, బోరు నీరు సరిపడ రాకపోవడంతో ఎప్పటిలాగే నీటి కటకట ఏర్పడుతూ వచ్చింది. దీంతో డయాలసిస్‌తో పాటురోగులకు తీవ్రఇబ్బందులు ఏర్పడ్డాయి. నీటికొరతతో డయాలసిస్ సేవలు అంతంత మాత్రంగానే కొనసాగగా బాధితుల కుటుంబసభ్యుల వైద్యులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఎన్నో ఏండ్లుగా డయాలసిస్‌కు నీటి కటకట ఏర్పడడంతో కిడ్నీబాధితులకు ఇబ్బందులు కల్గుతున్నా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమవుతూనే ఉన్నారని ఆరో పించారు. మున్సిపల్ ట్యాప్‌ను ఏర్పాటుచేస్తున్నా ఆ నీరు సైతం ఎంత వరకు సరిపోతాయనేది ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఆసుపత్రిలో ఉన్న బోర్ల ద్వారా మరింత నీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటేనే రోగులకు నీటి కటకట లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.



పనుల కోసం తీసుకువచ్చిన పైప్‌లు

ముదిరాజ్‌లను బీసీ ఏలో మార్చాలని వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

ఎల్లారెడ్డి, జూలై 14 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు బట్టువిఠల్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ఆదేశాల మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించామని ఆయన అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేయాలని ఆయన అన్నారు. ఈనెల 15 నుంచి 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించాలని తెలిపారు. జీవో నెంబర్-6 ప్రకారం చెరువుకుంటల మత్స్యసంపదపై ముదిరాజ్‌ల బెస్తగంగపుత్ర, గూండ్లకులాలకు మాత్రమే హక్కులు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, జక్కుల సం తోష్, ప్యాలాల రాములు, మర్రి బాలకృష్ణన్, ప్రకాష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా వెంకంపల్లి రోడ్డు



గుంతలు ఏర్పడిన వెంకంపల్లి రోడ్డు

నాగిరెడ్డిపేట, జూలై 14 : మండలంలోని వెంకంపల్లికి వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడి, కంకర తేలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు కలుగుతున్నాయి. లింగంపల్లి నుంచి వెంకంపల్లికు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బీటీ రోడ్డుపై వేసిన తారు లేచిపోయి గుంతలు ఏర్పడి కంకర తేలిం ది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతిరోజు లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్ తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. వాహనదారులు తిరుగుతుంటారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి, కంకర తేలి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు తగుచర్యలు తీసుకుని నూతన బీటీ రోడ్డు మంజూరు చేయించి రోడ్డును బాగు చేయాలని లింగంపల్లి, వెంకంపల్లి ప్రజలు కోరుతున్నారు.



గుంతల రోడ్డు

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

మద్నూర్, జూలై 14 : మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన వక్త దిగంబర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా భారతదేశంలో కాషాయ ధ్వజాన్ని గురు వుగా భావించి ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో గురుపూజ కార్యక్రమం గురు సమర్పణ కార్యక్రమాన్ని జరు పుకుం టారని గుర్తుచేశారు. భారతదేశంలో సనాతన ధర్మానికి సంబంధించిన గురువులే మానవులకు మార్గదర్శనం చేసి గురుబోధన చేస్తుంటారని, వారి మార్గంలోనే మానవుడు నడిచి జన్మసార్థకం చేసుకుంటారన్నారు. ప్రతివ్యక్తికి గురువు ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభా గ్ వ్యవస్థ ప్రముఖ్‌బెజగం సత్యనారాయణ, జుక్కల్ ఖండ కార్యవాహ జూట్లీ సంజీవ్, గ్రామ పెద్దలు స్వయం సేవకులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండల కేంద్రంతో పాటుగా మండలంలోని సిద్దరామేశ్వరగనర్ గ్రామాల్లో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురు పూజో త్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాతా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ సాయినాథ్ మాట్లా డుతూ ప్రతి హిందువులో చైతన్యం రావాలని, హిందు చైతన్యమే సమాజానికి శ్రేయస్కరమని కొనియాడారు. ఇకనుండి ప్రతిగ్రామంలో ఆర్ఎస్ ఎస్ కార్యకలపాలను కొనసాగించనున్నట్లు తెలి పారు. ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్మిక చట్టాలను అమలు చేయాలి

● ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి శంకర్

బాన్సువాడ టౌన్, జూలై 14 : ఆర్టీసీలో కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ బాన్సువాడ డివిజన్ కార్యదర్శి దోసెపల్లి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో సిబ్బంది తక్కువగా ఉండడంతో కార్మికులకు పనిభారం పెరిగిందన్నారు. డబుల్ డ్యూటీలు చేయకుంటే బస్సులు నడిచే పరిస్థితి లేదన్నారు. అధికారులు సైతం కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ యూనియన్లు లేకపోవడం వల్ల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతేకాకుండా అధికారులు అవినీతికి పాల్పడుతూ సంస్థను నష్టాల బాటలోకి నెట్టేయడం భావ్యం కాదన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కామారెడ్డి టౌన్, జూలై 14 : గిరిజన పోడు రైతులతో పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అన్నారు. ఆదివారం మాచారెడ్డి మండలం ఎల్లంపేట నడిపితండాలో మాట్లాడుతూ తాతల కాలం నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతులపై ఫారెస్ట్ అధికారులు, పోలీసులు జులాం ప్రదర్శించడం తగదన్నారు. పోలీసు బలగాలతో ఇంటింటికి తిరిగి రైతులను వేధించడం మానుకోవాలని తెలిపారు. రైతులపై జులాం చేసిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇది ప్రజాపరిపాలనని, ప్రజాస్వామ్య బద్ధంగా నడుస్తుందని చెప్పినప్పటికి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే ప్రజలపై ఫారెస్ట్, పోలీసు సిబ్బంది దాడులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

లయన్స్ అధ్యక్షుడికి యువకుల సన్మానం



బీర్కూర్‌లో లయన్స్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న యువకులు

బీర్కూర్, జూలై 14 : మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మేకల గాలయ్యను ఆదివారం స్థానిక యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేయించడం, మందులు అందజేయడం, శస్త్ర చికిత్సలు చేయించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని యువకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి మున్నూరుకాపు యూత్ అధ్యక్షులు గంధ్యపటం గంగాధర్, యువకులు ధర్మ తేజ, రాజు, శేఖర్, వెంకటేష్, శంకర్, నవీన్, సతీష్, రమేష్, రాజేందర్, గజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని పూజలు

రాజంపేట, జూలై 14 : మండలంలోని ఆర్గొండలో ఆదివారం వర్షాలు కురువకపోవడంతో వర్షాలు పడాలని గ్రామాలలో గ్రామదేవతలకు దేవాలయాలకు నీళ్ల పోసి, బండపాశంను గ్రామస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటికాలం నుంచి ఈనాటి వరకు గ్రామంలో సంప్రదాయం వరకు వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డి, జూలై 14 : పాముకాటుతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కంభం నాగయ్య (43) శనివారం ఇంట్లో నిద్రిస్తుం డగా నల్లకట్ల పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు మృతుడి భార్య సత్యవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్రంపై గ్రామ దేవతల ఊరేగింపు



గ్రామ దేవతలను గుర్రంపై తీసుకువస్తున్న గ్రామస్తులు

కామారెడ్డిటౌన్, జూలై 14: వర్షాలు బాగుపడాలని కోరుకుంటూ ఆదివారం కామారెడ్డి పట్టణంలోని లింగాపూర్ వాస్తవ్యులు గ్రామదేవతలను గుర్రంపై ఉరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు బాగా పండాలని వర్షాలు పడాలని గ్రామదేవతలకు కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు షానూరు, ఉపాధ్యక్షుడు మంచాల రమేష్, కార్యదర్శి వడ్లరవి, కోశాధికారి సుక్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్,జూలై 14 : కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు పాలోజ్యుల శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ప్రధానకార్యదర్శిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం శర్మ, రాజేశ్వర్ శర్మ, ప్రహలాదరావు, మహిళా అధ్యక్షురాలిగా సునీత, కోశాధికారిగా నవీన్‌శర్మ, జాయింట్ సెక్రటరీగా ఉదయభాను, వెం కటేశ్వర్‌రావు, వెంకటరమణరావు, సలహాదారులు కిషన్‌రావు, అర్జున్‌రావు, కాశీనాథ్‌రావు, ఈసీ మెంబర్‌లుగా శ్రీధర్ జోషి, చక్రధర్ కులకర్ణి, శ్రీధర్‌రావు కులకర్ణిలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ బ్రాహ్మణ సభ్యులంతా ఐక్య మత్యంతో ఉండాలని బ్రాహ్మణ సమస్యలు అందరం కలిసి సమిష్టిగా పరిష్క రించుకునేందుకు అందరం కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల బ్రాహ్మణులు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రదీప్‌రావు..

బాన్సువాడటౌన్ : కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా జిల్లా ఉపాధ్యక్షుడిగా బాన్సువాడ బ్రాహ్మణ సంఘానికి చెందిన దామరంచ ప్రదీప్‌రావు , సహాయ కార్యదర్శిగా బాన్సువాడ మండలం కోనాపూర్‌కు చెందిన వెంకటరమణలతో పాటు సలహాదారులను ఎన్నుకున్నారు. వీరిని బాన్సువాడ బ్రాహ్మణ సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాన్సువాడ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్‌రావు, కార్యదర్శి ఉమాకాంత్‌రావు, రాంచందర్‌రావు, త్రివిక్రమరావు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

- శాంతి - ఓసీ
- దర్శన్ - భారతీయుడు-2
- ప్రియా 70 - కల్కి
- ప్రియా 35 - భారతీయుడు-2

బాన్సువాడ

- మహేశ్వరి - భారతీయుడు-2
- వెంకటేశ్వర - మహారాజ

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

